క్లుప్తంగా

ఘనంగా చర్చి వార్షికోత్సవం



ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

పాణ్యం: స్థానిక బీసీ కాలనీలోని ఆగాపే చర్చిలో ఆదివారం తొమ్మిదవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఏసన్న ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి చర్చికి అన్ని విధాలుగా సహాయసహకారాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చర్చిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా చర్చిని నూతనంగా అలంకరించారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జయరత్నమ్మ (ఫైల్)

సి.బెళగల్: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ జయరత్నమ్మ (75) మృతికి గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజలు నివాళి అర్పించారు. ఆమె 2008 నుంచి 2013 వరకు సర్పంచ్‌గా సేవలందించారు. వృద్ధాప్య సమస్యలతో నెల రోజులుగా కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి కన్ను మూశారు. మృతదేహాన్ని శనివారం సి.బెళగల్‌కు తీసుకరావడంతో సర్పంచ్ పాండురంగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిలేటి, ముందరింటి వెంకటేష్, ఎస్‌ఎం బాషా, రామకృష్ణ, ఉప సర్పంచ్ ఎస్‌ఎం ఇబ్రహీం, ఇతరులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కేంద్ర పథకాల నిర్వహణపై విచారణ



బురాన్‌దొడ్డిలో లబ్ధిదారులను విచారిస్తున్న కేంద్ర తనిఖీ బృందం సభ్యుడు

సి.బెళగల్: మండల పరిధిలోని రెండు గ్రామ పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కేంద్ర బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. బురాన్‌దొడ్డి, పలుకుదొడ్డి గ్రామ పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను బృందం సభ్యులుప్రసాద్, రామచంద్ర పరిశీలించారు. ఆయా లబ్ధిదారులతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, వినియోగం, జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటి కొళాయిలపై ఆరా తీశారు. అదేవిధంగా గ్రామాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, అజార్‌అహ్మద్ ఉన్నారు.

ఆలయ నిర్మాణం పరిశీలన



శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కోటేశ్వరశర్మ

కోడుమూరు రూరల్: కోడుమూరులో దాతల సహకారంతో భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి నిర్మిస్తున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం అత్యద్భుతమని విశ్వహిందూ పరిషత్ నేషనల్ జాయింట్ సెక్రటరీ, అయోధ్య రామమందిర నిర్మాణ ఇన్‌చార్జ్ కోటేశ్వర శర్మ అన్నారు. కోడుమూరులో రూ.13కోట్లతో నిర్మిస్తున్న వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. పురాతన పద్ధతిలో సిమెంట్, ఇసుక ఉపయోగించకుండా పూర్తిగా రాతిశిలలు, రాతి దూలాలతో ఆలయాన్ని నిర్మిస్తుండడం బాగుందని తెలిపారు. ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆలయ నిర్మాణ విశేషాలను కోటేశ్వరశర్మకు వివరించారు. కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల ఖాదీ కమిషన్ చైర్మన్ చంద్రమౌళి, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ ప్రచారక్ సురేంద్ర, ఆలయ కమిటీ సభ్యులు రాజశేఖర్, వేణుగోపాల్, విజయ్, దామోదర్, రంగస్వామి, కిషోర్, మధుసూదన్, రామక్రిష్ణ, వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు హాజరుకావాల్సిందే

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాయింట్ ఎల్‌పీఎంతో తల్లులకు శాపం

- ఎక్కువ భూమి ఉన్నట్లు చూపడంతో వర్తించని పథకాలు
- రెండు సచివాలయాల్లో 188 మంది తల్లులకు మొండిచెయ్యి

కల్లూరు: కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో అసైన్డ్ భూములు, డి పట్టా భూములు, అలాగే పట్టా భూములపై సాగుదారులకు ఎలాంటి సమాచారం లేకుండా రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా రీసర్వే చేశారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు రైతులకు జాయింట్ ఎల్‌పీఎం కేటాయించారు. జాయింట్ ఎల్‌పీఎం సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభలు, రీసర్వే గ్రామసభల్లో అర్జీలు పెట్టుకున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని జాయింట్ ఎల్‌పీఎం ఉన్న రైతులు వాపోతున్నారు.

పరిష్కరిస్తేనే పథకాలు

సబ్ డివిజన్ చేసి తమ భూమికి ప్రత్యేక ల్యాండ్ పార్సెల్ నంబర్లు ఇవ్వాలని రైతులు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రీసర్వే చేసిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలు స్వీకరించారు. అయినా క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు. సర్వే నంబర్‌లో సంబంధిత రైతులకు నోటీసులిచ్చి కొలతలు వేసి సబ్ డివిజన్ చేసి కొత్త ఎల్‌పీఎం నంబర్ ఇవ్వాలి. ఈ ప్రక్రియ జరగడం లేదని సాగుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కరిస్తేనే 'తల్లికి వందనం'తో పాటు ఇతర పథకాల లబ్ధి చేకూరుతుందని రైతులు అంటున్నారు.

అధికారుల తప్పిదంతో అందని పథకాలు

ఉలిందకొండలో రెండు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వాటి కింద యాపర్లపాడు, కొల్లంపల్లి తాండ, ఎర్రకత్వ గ్రామాలు ఉన్నాయి. ఉలిందకొండ గ్రామంలో రీసర్వే పూర్తయ్యింది. అయితే అధికారుల తప్పిదం వల్ల గ్రామంలో చాలా మందికి వారు సాగు చేసుకుంటున్న భూమి కన్నా అధికంగా ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. దీంతో ఉలిందకొండలోని రెండు గ్రామ సచివాలయాల పరిధిలో సుమారుగా వంద మంది తల్లులు 'తల్లికి వందనం' పథకానికి దూరమయ్యారు.



గ్రామ సచివాలయం

'తల్లికి వందనం' డబ్బులు రాలేదు



మాకు ఉలిందకొండలో 620/49 సర్వే నంబర్‌లో ఎకరం భూమి మాత్రమే ఉంది. రీసర్వే చేసిన అధికారులు ప్రత్యేక ఎల్‌పీఎం కేటాయించకుండా జాయింట్ ఎల్‌పీఎం నంబర్ కేటాయించారు. దీంతో 10 ఎకరాలకు పైగా భూమి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతుంది. దీంతో 'తల్లికి వందనం' పథకం వర్తించలేదు. మా ముగ్గురు పిల్లలు చదువుకుంటుండంతో రూ.45 వేలు నష్టపోయాం. అధికారులు న్యాయం చేయాలి. – రక్షిత, ఉలిందకొండ

పలుమార్లు విజ్ఞప్తి చేశాం



ఉలిందకొండ, కొల్లంపల్లితాండ, ఎర్రకత్వ, యాపర్లపాడు, ఓబులాపురం తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. అయితే రీసర్వేలో అధికారులు ప్రభుత్వ భూములన్నింటికి ఒకే ఎల్‌పీఎం నంబర్ కేటాయించారు. దీంతో ఎక్కువ భూమి కలిగి ఉన్న రైతులుగా చూపుతూ ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదు. ఈ విషయంపై పలుమార్లు విజ్ఞప్తి చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. – కె. మధు, సీఐటీయూ మండల కార్యదర్శి

భోగేశ్వరాలయంలో భక్తజన సందడి



ప్రత్యేకాలంకరణలో భోగేశ్వరుడు

గడివేముల: దక్షిణ కాశీగా పిలువబడే మండల పరిధిలోని దుర్గా భోగేశ్వరాలయంలో ఆదివారం సెలవురోజు కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. భక్తులు తెల్లవారుజాము నుంచే పంచకోనేర్లలో స్నానమాచరించి స్వామి,అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ చెప్పారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు. స్వామి,అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు స్థానిక కాశీరెడ్డినాయన ఆశ్రమంలో ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు.

'ఉపాధి'లో అవినీతిపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న అస్లామ్

కోడుమూరు రూరల్: గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయించాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు, గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్ డిమాండ్ చేశారు. గూడూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీ నాయకులు, 'ఉపాధి' సిబ్బంది కుమ్మక్కై భారీగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఉపాధిలో జరుగుతున్న అక్రమాలపై ఈనెల 30న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్నామన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు ఖలీల్, మద్దిలేటి, కోఆప్షన్ సభ్యులు మదార్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పత్తి రంగడు, రామాంజినేయులు, సత్యాలు, ముజీబ్, శమీర్, రషీద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న రాఘవేంద్ర

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని మరచిపోయిందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర విమర్శించారు. ఆదివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో కర్నూలు మండల డీవైఎఫ్ఐ కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి నాయకులు ఏమి సాధించారని ఏడాది సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. కర్నూలు మండలంలో ఎక్కడ చూసిన రోడ్లు బాగలేక ప్రజలు ప్రమాదపుటంచుల్లో ప్రయాణాలు చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఉల్చాలలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉందన్నారు. ఆర్కే దుద్యాల గ్రామానికి నేటికీ సరైన రోడ్డు సదుపాయం లేదన్నారు. అనేక గ్రామాల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేక మరుగునీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మండల నాయకులు హరికిషన్‌రెడ్డి, రాజు, దివాకర్, గోవర్ధన్, ప్రశాంత్, రోహిత్, రఘువరన్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న ఆర్‌టీఐ సెక్రటరీగా నియమితులైన నేతలు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్‌టీఐ విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన (కల్లూరు రైతు సంఘం నాయకుడు) రంగప్ప ఆదివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడే వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయన్నారు. కార్పొరేటర్లు నరసింహులు, సాన శ్రీనివాసులు, నాయకులు వీరేంద్రకుమార్, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా



పెసరవాయిలో అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గడివేముల: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన పెసరవాయి గ్రామంలో అనుమానితుల ఇళ్ల సోదాలు నిర్వహించారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారి అంగళ్లలో దాడులు చేయగా 15 క్వార్టర్ సీసాలను పట్టుకోవడంతో పాటు నంబర్ ప్లేట్లు లేని 12 మోటార్ బైకులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సీఐ మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానితులు ఎవరైనా ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాలలో అల్లర్లు, గొడవలకు పోకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. పొలాలు, ఇళ్ల వద్ద చిన్న చిన్న గొడవలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువచ్చి శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. నాటుసారా, గుట్కా, పేకాట ఆడితే కఠినచర్యలు తప్పవన్నారు. స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

శివారు కాలనీలపై చిన్నచూపు



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ కార్యకర్తలు, నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం నగర శివారుల అభివృద్ధిని విస్మరించిందని, ఫలితంగా ప్రజలు కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని సీపీఐ నగర సహాయ కార్యదర్శులు దంబోళం శ్రీనివాసరావు, సి.మహేష్ విమర్శించారు. ఆదివారం కర్నూలు నగరంలోని సీపీఐ టీవీ9 ప్రజానగర్, ఇందిరమ్మ కాలనీ, కుమ్మరివీధి, గనిగల్లీ శాఖల మహాసభలు జరిగాయి. ఆయా శాఖలకు సంబంధించి శ్రీనివాసరావు కాలనీలో బహిరంగ సభ నిర్వహించారు. అంతకముందు ఆటో స్టాండ్ వద్ద ముఖ్య అతిథులు శ్రీనివాసరావు, సి.మహేష్ జెండావిష్కరణ చేశారు.

పడకేసిన పల్లె వైద్యం

- ఇంటి వద్దకు వైద్యసేవలు ఏవీ?
- అమలు కాని ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ పథకాలు
- అల్లాడుతున్న దీర్ఘకాలిక రోగులు
- బీపీ, షుగర్ రోగులకు అందని మందులు
- గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వైద్యసేవలు



గత వైఎస్సార్‌సీపీ పాలనలో రోగికి ఇంటి వద్దకే వెళ్ల వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ (ఫైల్)

గడివేముల: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే గ్రామీణ ప్రాంత రోగులు నానా అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేద రోగులకు వరంలా మారింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నేడు పూర్తిస్థాయిలో వైద్యం అందక ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు రోగులు వాపోతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులు, ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, గర్భిణులు, బాలింతలు వైద్య పరీక్షల కోసం పట్టణాలకు వెళ్లేవారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్ల వద్దకే వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది వచ్చి వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందించేవారు. నేడు గ్రామాల్లో ఎక్కడా వైద్య శిబిరాలు కానరాకపోవడంతో రోగులు పడే పాట్లు వర్ణనాతీతం. దీంతో రెక్కాడితే కాని డొక్కాడని పేదలకు జబ్బు చేసిందంటే ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

షుగర్, బీపీ పేషెంట్లకు భరోసా లేదు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వయస్సుతో నిమిత్తం లేకుండా షుగర్, బీపీ వంటి రోగాలు జనాలను పట్టిపీడిస్తున్నాయి. వీటి వల్ల రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజలు వీటికి వైద్యం చేయించుకోలేక, మందులు కొనుగోలు చేసుకోలేక ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇన్సులిన్ సరఫరా ఆగిపోవడంతో రోగులు అల్లాడిపోతున్నారు. డబ్బులు పెట్టి మందులు కొనుగోలు చేసుకోలేక, ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించకోలేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇన్సులిన్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని వారంటున్నారు.

గత ప్రభుత్వంలో గ్రామీణ వైద్యం పటిష్టం

ప్రతి 2 వేల మంది జనాభాకు ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ చొప్పున మండలంలో 14 ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో బీఎస్సీ నర్సింగ్ చేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పాటు, అక్కడ ఏఎన్‌ఎం, ఆశ, హెల్త్ అసిస్టెంట్ విధులు నిర్వహించేవారు. దీంతో బీపీ, షుగర్ వంటి పరీక్షలతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సత్వరమే వైద్య సేవలు అందించేలా అక్కడ విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పాముకాటు, పాయిజన్‌కు గురైనప్పుడు సత్వరమే ఏమి చేయాలనే అంశాలపై కూడా వారికి శిక్షణ ఇవ్వడంతో ప్రాణాపాయం నుంచి తప్పించగలిగే పరిస్థితి ఉండేది. అంతేకాకుండా గతంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాలను నాడు-నేడు ద్వారా అధునికీకరించారు. అత్యాధునిక లేబొరేటరీ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.



గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జగనన్న ఆరోగ్య సురక్ష వరం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణులతో పాటు, పట్టణ ప్రాంత ప్రజలకు వరంలా మారింది. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో స్పెషలిస్టు వైద్యులతో శిబిరం నిర్వహించి, అన్ని రకాల పరీక్షలతో పాటు, ఉచితంగా మందులు అందించేవారు. స్త్రీల గర్భకోశ సమస్యలు, రక్తహీనత వంటి వాటికి ఉచితంగా మందులు అందజేసేవారు. అటువంటి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేడు గ్రామాల్లో ఆ మాటే వినిపించడం లేదు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు నిత్యం వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. కనీసం మందులు కూడా అందుబాటులో ఉండటం లేదని రోగులు దీనంగా చెబుతున్నారు.

గతంలో ప్రతి నెలా 3183 మందికి వైద్య సేవలు

గత ప్రభుత్వంలో మండలంలోని గ్రామాల్లో ప్రతి నెలా 3183 మంది 104, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందుకునేవారు. ఇందులో పేదలు ఉండటం వలన ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో షుగర్ మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండటం లేదు. ముఖ్యంగా ఇన్సులిన్ అందుబాటులో లేదు. కొన్ని మందులు మాత్రమే ఇస్తున్నారు. దీని వలన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలి. వైద్య శిబిరాలు నిర్వహిస్తే బాటుంది. – దస్తగిరి, గడివేముల

గ్రామంలోనే వైద్యం అందించాలి



ఏ చిన్న రోగం వచ్చినా చికిత్స కోసం గ్రామం నుంచి నంద్యాలకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో మా ఊర్లోనే విలేజ్ క్లినిక్ ద్వారా డాక్టర్లు వైద్యం చేసేవారు. ఇప్పుడు ఎటువంటి శిబిరాలు నిర్వహించడం లేదు. గతంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు ఇచ్చారు. మా గ్రామంలోనే వైద్య శిబిరాలు నిర్వహిస్తే అక్కడే వైద్య పరీక్షలు చేయించుకుంటాం. – మహబున్నీ, గడివేముల

కార్మికుల గోడు ప్రభుత్వానికి పట్టదా?



గూడూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: విధులను బహిష్కరించి 54రోజుల నుంచి నిరవధిక దీక్షలు చేస్తున్నా కార్మికుల గోడు కూటమి ప్రభుత్వానికి పట్టదా అని గూడూరు నగర పంచాయతీ కార్మికులు ప్రశ్నించారు. గూడూరులో నగర పంచాయతీ కార్మికులు 54రోజుల నుంచి సమ్మె చేస్తున్నారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు అరవింద్, దూకేశ్వరరావు మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పని చేస్తూ కుటుంబాలను పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రభు త్వం స్పందించి 15 ఏళ్లు పైబడి పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, టెక్నికల్, నాన్ టెక్నికల్ ఆధారంగా జీతాలను సక్రమంగా చెల్లించడంతో పాటు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈనెల 29వ తేదీ అర్ధరాత్రి నుంచి వీధిలైట్లు, నీళ్ల సరఫరాను పూర్తిగా బంద్ చేసి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. కార్మికులు మధు, షబ్బీర్, ఆంజనేయులు, బసవరాజు, జయన్న, అల్లిబాషా, ఖాజా, ప్రభాకర్, ఉసేన్, పఠాన్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీలో డ్రోన్ టెక్నాలజీ కోర్సు



శిక్షణ పూర్తి చేసుకున్న క్లస్టర్ యూనివర్సిటీ అధ్యాపకులు

కర్నూలు(సెంట్రల్): క్లస్టర్ యూనివర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఎమ్మెస్సీ డ్రోన్ టెక్నాలజీ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు ఆ సంస్థ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం వర్సిటీ అధ్యాపకులకు ట్రిపుల్ ఐటీడీఎంలో ఇస్తున్న డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా డ్రోన్ హబ్‌గా మారనున్న నేపథ్యంలో తమ కళాశాల అధ్యాపకులకు ట్రిపుల్‌ఐటీ డీఎం వారితో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించినట్లు చెప్పారు. కేవీఆర్ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకురాలు సమన్వయకర్తగా వ్యవహరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్యకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందని, సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు https://meekosam.ap.gov.in ఈ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.